ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.24 శనివారం సాయంత్రం
సహరి: 4.38 ఆదివారం ఉదయం


వైసీపీ పాపాల పుట్ట.. ఈ మెట్ట : ఎటు చూసినా రామేశం మెట్టంతా ఇలా గుల్లగుల్ల చేశారు. (ఫైల్)

రామేశ్వరం మెట్టలో.. పాపాల ద్వారం!

గత ఐదేళ్లూ కొండలను మింగేసిన ఘనులు

గత వైసీపీ ఐదేళ్ల పాలనకు పై చిత్రం ఒక నిదర్శనం.. ఉమ్మడి జిల్లాలో చాలా కొండలది ఇదే పరిస్థితి.. కన్నుపడితే చాలు ఖాళీ చేసేశారు.. కొండలను మింగేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.. ఇదెక్కడో మారుమూల కాదు.. పెద్దాపురం రామేశం మెట్ట.. ఏకంగా 823 ఎకరాల్లో ఉన్న కొండ నేడు ఇలా తయారైంది.. గత ఐదేళ్లలో ఈ కొండను గుల్ల చేసి వేల కోట్లు దందా చేశారు.. ఎన్‌జీటీ దృష్టి సారించడంలో పాపాల ద్వారాలు తెరుచుకోనున్నాయి.. అక్రమార్కుల భరతం పట్టే సమయం ఆసన్నమైంది.

- కాకినాడ/ఆంధ్రజ్యోతి

- నాడు రెచ్చిపోయిన మాఫియా
- అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకం
- 823 ఎకరాలు గుల్లగుల్ల
- లక్షల క్యూబిక్ మీటర్ల తరలింపు
- కాకినాడ కీలక నేత కనుసన్నల్లో దందా
- రిజర్వు ఫారెస్టు మింగేసిన వైనం
- రూ.250 కోట్ల రాయల్టీ ఆదాయానికి గండి
- 19న ఎన్‌జీటీ కోర్టులో కేసు



823 ఎకరాల్లో.. మింగేశారు!

పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో 823 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించి ఉన్నాయి. సర్వే నెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న ఈ ప్రాంతాన్ని రామేశ్వరం మెట్టగా పిలుస్తారు. మధ్యలో కొంత ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఇందులో జింకలు, దుప్పిలు, లేళ్లు ఇతర వన్యప్రాణులెన్నో ఉన్నాయి. కాకినాడకు సమీపంలో ఉన్న ఈ కొండలు, గుట్టల్లో నిక్షిప్తమై ఉన్న గ్రావెల్‌పై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి కన్ను పడింది. అంతే రామేశం మెట్టను గుల్ల చేసేశారు. 823 ఎకరాల్లో కొండలను మింగేసి మట్టి,గ్రావెల్ కోసం కొండల కింద భూమిని సైతం లోయలుగా మార్చేశారు. అప్పటి కాకినాడ వైసీపీ కీలక నేత ద్వారంపూడి, ఆయన మనుషులు సాగించిన దోపిడీ పర్వం విలువ వందల కోట్లుపైనే. అయితే అప్పట్లో సదరు నేతకు భయపడి కలెక్టర్ నుంచి జేసీ వరకు గనుల శాఖ నుంచి రెవెన్యూ శాఖ వరకు అన్నీ సాగిలపడ్డాయి. ఎంత తవ్వకున్నా కన్నెత్తి చూడ్డానికి భయపడ్డాయి. ఇప్పుడు ఎన్జీటీ కేసు విచారణకు స్వీకరించడంతో వేల కోట్ల కుంభకోణం బట్టబయలయ్యే అవకాశం కనిపిస్తోంది.

పెద్దాపురం రామేశ్వరం మెట్ట అక్రమ తవ్వకాలపై అక్రమార్కులకు ఉచ్చు బిగుస్తోంది. ఇన్నేళ్లపాటు యథేచ్ఛగా 823 ఎకరాల్లో కొండలను గుల్ల చేసి గ్రావెల్ తవ్వుకుపోయి వందల కోట్లు సంపాదించిన నేతలు, అధికారులపై ఎన్‌జీటీ రూపంలో భారీ షాక్ తగలబోతోంది. ఇక్కడ వేల కోట్ల దందాపై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ దృష్టి సారించింది. దీంతో అక్రమార్కులు, వారికి కొమ్ముకాసిన అధికారులు ఇరుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొండలు గుల్ల గుల్ల

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానాం తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉండేది. రామేశం మెట్టలో తవ్విన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చదును కోసం అమ్మని రియల్ ఎస్టేట్ వెంచర్ లేదు. వేల టిప్పర్ల మట్టి, గ్రావెల్‌ను కాకినాడలోని కీలక వైసీపీ నేత తన అనుచరుల ద్వారా విక్రయించి సంపాదించిన కోట్లకు లెక్కేలేదు. అప్పటి సర్కారులో ముఖ్య నేతకు అతి సన్నిహితమైన వ్యక్తి కావడంతో ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదు. పేదల ఇళ్ల స్థలాల చదును ముసుగులో అప్పటి తన సామాజిక వర్గ కలెక్టర్ సహకారంతో సదరు కీలక నేత అనుమతులు తీసుకుని ఇక్కడున్న కొండలు, గుట్టలను ఖాళీ చేసి వందల కోట్లకు పడగలెత్తారు. గనులశాఖ అధికారులంతా ఐదేళ్లపాటు అడ్డుకోకపోవడంతో పెద్దపెద్ద కొండలన్నీ కరిగిపోయాయి. 823 ఎకరాల మెట్టంతా మింగేసి సగానికి పైగా భూములను సదరు వైసీపీ అక్రమార్కులు లోయలుగా మార్చేసినా జిల్లా గనుల శాఖ మౌనమే వహించింది. కొన్ని భూములను ప్రభుత్వం స్థానిక ఎస్సీ రైతుల సాగు కోసం అసైన్డ్ భూముల కింద కేటాయించింది. వీటిని ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున చెల్లించి ఇరవై అడుగుల లోతుకు మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారు. వందల ఎకరాల అసైన్డ్ భూములను లీజుకు తీసుకుని లోయలుగా మార్చేసినా రెవెన్యూశాఖ సైతం కన్నెత్తి చూడలేదు. ఈ రెండు శాఖలు ఉమ్మడిగా సర్వే చేసి తవ్వి తరలించుకుపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి సంగతి తేల్చుతామని ప్రగల్భాలు పలికి సర్వే జోలికి వెళ్లలేదు. కరెంటు స్తంభాలైతే అడుగు నుంచీ గాల్లో వేలాడుతున్నాయి. ఇక్కడ నుంచి తరలిపోయిన కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టికి గనులశాఖకు రూ.250 కోట్లకుపైనే రాయల్టీకి గండిపడింది. అయినా జరిమానా విధించే సాహసం చేయడం లేదు. అక్రమ తవ్వకాలపై స్పందనలో ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం ఎన్‌జీటీని ఆశ్రయించడంతో కదలిక వచ్చింది.

ప్రత్యేక కమిటీతో దర్యాప్తు చేయండి...

రామేశ్వరం మెట్ట అక్రమాలపై రెండేళ్ల కిందట పెద్దాపురానికి చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించినా నీరుగార్చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్దాపురానికి చెందిన కర్రి వెంకట రమణ తాజాగా చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. మెట్టలో వందల కోట్ల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ చేయించాలని ఆధారాలతో సహా పిటిషన్‌లో కోరారు. దీనిపై స్పందించిన ఎన్‌జీటీ కేసును ఎట్టకేలకు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మార్చి 19న కేసును రిజిస్టర్ చేసింది. దీంతో అక్రమార్కులకు ఉచ్చు బిగుసుకోనుంది. మెట్ట అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తే వందల కోట్ల కుంభకోణం బట్టబయలు కానుంది. అక్రమార్కుల నుంచి కళ్లప్పగించి చూసిన గనులు, రెవెన్యూ శాఖలు ఇరుక్కోనున్నాయి. మరోపక్క మెట్టలో అసైన్డ్ భూమాఫియా, అటవీ చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపైనా పిటిషనర్ ఫిర్యాదు చేయడంతో ఎన్జీటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. అయితే కాకినాడ నగరంలో పేదల ఇళ్ల స్థలాల పేరుతో మడ భూములను చదును చేసేసిన కేసులో ఇప్పటికే ఎన్జీటీ బాధ్యులైన అధికారులకు చుక్కలు చూపించింది. కోట్లలో జరిమానా కూడా విధించింది. ఈనేపథ్యంలో మెట్ట అక్రమాలపైనా ఎన్‌జీటీ ఉక్కుపాదం మోపాల్సి ఉంది.





అవినీతి 'ఆనందం'

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సాగుతున్న సోదాలు

ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు

5



కలసిమెలసి..

కాకినాడ జిల్లాలో ముస్లింలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు.. ముందుగా నమాజ్‌లు చేశారు. అనంతరం కలసి మెలసి ఆనందంగా విందు స్వీకరించారు.. ముస్లింలకు తగినట్టుగా విందును తయారు చేయించడంతో ఆనంద వ్యక్తం చేశారు. విందుకు ముస్లింలను స్వాగతించిన కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే కొండబాబులకు పుష్పగుచ్ఛాలు అందజేసి మత పెద్దలు సత్కరించారు. తమకు అండగా ఉండాలని కోరారు.. పలు సమస్యలు విన్నవించారు. - వివరాలు 6లో


అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరుకు కేటాయించిన 200 ఎకరాల మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

ఆనంద..తీరం!

మళ్లీ తెర మీదకు 'డ్రెడ్జింగ్' కార్పొరేషన్, యూనివర్సిటీ

- పదేళ్ల కిందట చంద్రబాబు ప్రకటన
- నాడు చొరవ చూపని కేంద్రం
- కనీసం పట్టించుకోని వైసీపీ
- కూటమి రాకతో మళ్లీ వెలుగు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- నేడు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్
- అంతర్వేదిలో ఆర్డీవో పర్యటన
- 200 ఎకరాల భూముల గుర్తింపు

అంతర్వేది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబునాయుడు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అంతర్వేది తీరంలో ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై అప్పటి ఎంపీగా ఉన్న డాక్టర్ పండుల రవీంద్రబాబు కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేశారు. అయితే అప్పట్లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నష్టాల్లో ఉందన్న సాకుతో ఈ ప్రతిపాదనకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటు కాలేదు. అప్పట్లో కార్పొరేషన్ వస్తుందన్న ప్రచారంతో సముద్రతీర ప్రాంతంలో తక్కువ ధర ఉన్న భూములను సైతం అధిక ధరలకు కొనుగోలు చేసి రిసార్టులు, ఇతర భవనాలు నిర్మించారు. కానీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రతిపాదన గత పదేళ్లలో మరుగున పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఊసేలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ సీఎం చంద్రబాబు అంతర్వేది తీరంలోనే అనువైన ప్రదేశంగా భావించి అక్కడే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సైతం మొగ్గు చూపడంతో మళ్లీ ప్రాజెక్టు అమలుపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురించాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవి అంతర్వేది తీరాన్ని పరిశీలించి డ్రెడ్జింగ్ కార్పొరేషన్, యూనివర్సిటీ ఏర్పాటుకు సుమారు 200 ఎకరాల భూమి అవసరంగా భావించి పరిశీలన చేసి ప్రాథమికంగా మార్కింగ్ కూడా ఇచ్చారు. దాంతో ఇప్పుడు మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఏర్పాటుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా రాజోలు నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర సౌకర్యాలు లభిస్తాయనేది వారి ఆకాంక్ష. ప్రస్తుతం ఆర్డీవో మాధవి తీర ప్రాంత భూముల పరిశీలనతో ఆ ప్రాంతంలో మళ్లీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో హడావుడి నెలకొంది.

చిగురించిన ఆశలు

భూములు పరిశీలించిన ఆర్డీవో..

సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన చేశామని అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం ఆమె దర్శించుకుని అనంతరం అంతర్వేది నుంచి చింతలమోరి వరకు ఉన్న తీర ప్రాంత భూములను స్థానిక అధికార యంత్రాంగం, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బరు ఏర్పాటుకు 200 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు.ఆ భూముల్లో ప్రస్తుతం రూ.1850 కోట్లతో డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారన్నారు. ఇప్పటికే సముద్రతీరంలో పెరుగు భూములను పరిశీలించి మార్కింగ్ వేశామని, వాటిని సర్వేచేయించి ఎంత భూమి అవసరం అవుతుందో మ్యాపు ద్వారా పరిశీలించి నివేదిక తయారు చేస్తామన్నారు. తీర ప్రాంత భూముల్లో సరుగుడు, కొబ్బరి వేసి ఉన్న రైతులకు నష్టం కలుగుతుందని రైతులు అమలాపురం ఆర్డీవో కె.మాధవిని అడగ్గా ఆమె రైతులతో మాట్లాడారు. పెరుగు భూమిలోనే సాగు చేసుకుంటున్నారు కదా నష్టపోయేదేమి ఉంది.. ప్రభుత్వం స్వాధీన పరుచుకుని డ్రెడ్జింగ్ హార్బరు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే అంతర్వేది పరిసరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోడ్లు, ఉపాధి కలుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, సర్వేయర్ భద్రరాజు, పలు సొసైటీల అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి!


కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం దృశ్యం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు, నానాజీ తదితరులు

- వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- పీఎం సూర్యఘర్ కింద నియోజకవర్గానికి 10 వేల గృహాలపై సోలార్‌రూఫ్
- జిల్లాలో 49 వేల 380 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన
- వెయ్యి కోట్ల అంచనాతో ఏలేరు, పీబీసీ కాల్వల ఆధునికీకరణ
- విలేకరుల సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి28(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి మాసాల్లో వడగాల్పులు, తాగునీటి ఎద్దడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ జిల్లా అధికారులను కోరారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకర్ల మాట్లాడుతూ సీఎం ఆదేశాల అనుగుణంగా జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గానికి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద 10వేల గృహాల చొప్పున 7 నియోజకవర్గాల్లో 70వేల గృహాలపై 2కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఈ యూనిట్ల కోసం ఇప్పటివరకు 5,086 దరఖాస్తులు అందగా 3230 కిలోవాట్ల సామర్థ్యంకోసం 890 యూనిట్లు నెలకొల్పారన్నారు. మిగిలిన లక్ష్య సాధనకు ఎనర్జీ అసిస్టెంట్లతో పథకం గురించి విస్తృతంగా అవగాహన కల్పించి దరఖాస్తులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. జిల్లాలో వడగాల్పులు కారణంగా ఒక్క మరణం కూడా జరకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని గ్రామీణ ఆవాసాల్లో 463, పట్టణ ఆవాసాల్లో 17 చలివేంద్రాలు ఏర్పాటుచేశామని, దాతల సహకారంతో మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి మాసాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.12.82 లక్షలతోను, పట్టణ ప్రాంతాల్లో రూ.కోటి 72లక్షలతోను యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద గ్రామాల్లో 1484 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు మంజూరుచేయగా, ఇప్పటివరకు 420 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వ్యవసాయంలో ఖర్చు, శ్రమ తగ్గించే డ్రోన్ల వినియోగాన్ని విస్తృతం చేసే అంశంపై చర్యలో జిల్లాలో 30 మందికి డ్రోన్ పైలట్ శిక్షణ కల్పించామన్నారు. జిల్లాలో 49వేల 380 ఎకరాలల్లో ప్రకృతి వ్యవసాయం సాగుచేసేవిధంగా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పాడిపరిశ్రమ ప్రోత్సాహనికి ముఖ్యమంత్రి సూచించిన విధంగా జిల్లాలోని రూ.3.50 లక్షల పశువులకు అవసరమైన రూ25 లక్షల టన్నుల పశుగ్రాసం ఉత్పాదనకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆక్వారంగ సమీక్షలో విద్యుత్ సబ్సిడీ పొందేందుకు జిల్లాలో 12,477 ఎకరాల్లో ఆక్వా చెరువులు రిజిష్టరు అయ్యాయన్నారు. మరో 10,577 ఎకరాలు రిజిస్ట్రేషన్ పొందవలసి ఉందన్నారు. ఆక్వా చెరువుల డిశ్చార్జీల వల్ల పంట భూములకు, భూగర్భ జలాలకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధికల్పన సమీక్షలో జిల్లాలో ఇప్పటివరకు 37 జాబ్ మేళాలు నిర్వహించి 2681 మంది యువతకు ఉద్యోగాలు కల్పించామన్నారు. రానున్న మూడు నెలల్లో 50పెద్ద కంపెనీలతో డ్రైవ్‌లు నిర్వహించి మరో 3వేలు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జిల్లాలోని 52 సంక్షేమ హాస్టళ్లకు రూ.16.87 కోట్లు ప్రభుత్వ సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. జీజీహెచ్‌లో శిథిలావస్థలో ఉన్న అవుట్‌పేషెంట్ బ్లాక్, మెడికల్ బ్లాక్‌లు స్థానంలో కొత్త బ్లాక్‌ల నిర్మాణానికి రూ.500 కోట్ల అంచనాతో ప్రతిపాదన సమర్పించామన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే వెయ్యి కోట్ల అంచనాతో ఏలేరు, పీబీసీ కాల్వల ఆధునికీకరణకు డీపీఆర్ సమర్పించామని నిధులు మంజూరు చేయాలన్నారు. ఉప్పాడ వద్దకోతకు గురౌతున్న సముద్ర తీర రక్షణకు సీవాల్ నిర్మాణాన్ని ఎన్డీఎంఏ ద్వారా రూ.323 కోట్ల నిధులతో చేపట్టేందుకు ప్రతిపాదించామని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. అనంతరం సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, కమిషనర్ భావన, పాల్గొన్నారు.

ఐదు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

3 జనసేనకు.. 2 టీడీపీకి

కాకినాడ/అమలాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్లు చోటుదక్కించుకున్నారు. ఇందులో రెండు టీడీపీకి, మూడు జనసేనకు దక్కాయి. పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి (జనసేన) నియమితులయ్యారు. ఈమె ఎస్సీ మహిళ కేటగిరీ నుంచి ఎంపికైంది. కాకినాడ రూరల్‌లోని కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ (జనసేన), కాకినాడ జిల్లా జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా అడపా భరత్‌బాబు (టీడీపీ) నియమితులయ్యారు. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలో నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి (జనసేన), మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చింతపల్లి రామకృష్ణ (టీడీపీ) నియమితులయ్యారు.

ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని సూర్యకళామందిరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

'పని'లో పనిగా...



ఏ ఎండకు ఆ గొడుగు అంటే ఇదేనేమో... ఎండలు రోజురోజుకీ ముదురుతున్నాయి... సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు... అలాగని బయటకి రావడం తప్పదు కదా... ఓ పనికోసం బైక్‌పై రేకు తీసుకెళ్తున్న వీరిద్దరూ ఎండ నుంచి కాపాడకోవడానికి దానినే అడ్డుపెట్టుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్టీవో ఆఫీసు సమీపంలో శుక్రవారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పట్టు తప్పిందా... ప్రాణం గోవిందా!



కొంతమంది ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు కారణాలవుతున్నారు. కొందరు ఆటోలో నిల్చుని, మరికొంతమంది వెనుక పల్చని ఇనప రేకుపై కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారిపై ఇలాంటి ప్రయాణాలు నిత్యకృత్యం. రవాణా, పోలీసు అధికారులు ఇటు చూడండోసారి...

శంఖవరం (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

రాజానగరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ బొమ్మూరులో నైపుణ్య శిక్షణ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 150 మందికి లక్ష్యంగా, ఎస్సీ కులాలకు చెందిన పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ కేటగిరిల్లో నైపుణ్య శిక్షణ కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్‌మెంట్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు లేదా నేరుగా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మూడు రోజులలోగా వివరాలు నమోదు చేసుకోవాని ఎంపీడీవో ఝాన్సీ పేర్కొన్నారు.

కాండ్రకోట నూకాలమ్మ జాతర ప్రారంభం



పెద్దాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోటలో కొలువై భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోలాటం, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళిక వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

2 నుంచి పీజీ సెట్ మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి పీజీ సెట్-2025కు మేథమెటిక్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, హెచ్‌వోడీ జి.చంద్రశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ మేథమెటిక్స్‌లో శిక్షణ ఉంటుందని, సిలబస్‌లో ముఖ్యమైన టాపిక్స్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల కోసం 94416 86669, 94916 92923 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్, హెచ్‌వోడీ పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా వర్శిటీతో జేఎన్టీయూకే ఎంవోయూ



పత్రాలను మార్చుకుంటున్న వీసీ ప్రసాద్, ఒనిన్స్కీ

జేఎన్టీయూకే, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ తో కాకినాడ జేఎన్టీయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. వీసీ సమావేశ హాల్లో ఎంవోయూపై ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, యూనివర్శిటీ ఆఫ్ న్యూకాజిల్ ప్రో వీసీ డాక్టర్ అలెగ్జాండర్ ఒనిన్స్కీతో శుక్రవారం చర్చించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్,మేనేజ్‌మెంట్ విభాగాల్లో విద్యార్థులకు యూజీ, పీజీ కోర్సులను అందిస్తుందన్నారు. ఒనిన్స్కీ మాట్లాడుతూ క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో తమ యూనివర్శిటీలోని విభాగాలు ఉత్తమర్యాంకులు కలిగి ఉన్నాయన్నారు. 92శాతం మంది విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంవోయూకు సుముఖత వ్యక్తంచేశారు.ఎఫ్‌యూఆర్ డైరెక్టర్ స్వర్ణకుమారి, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ ప్రసాదరాజు, డైరెక్టర్లు బాలకృష్ణ, గోపాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న అంజలి ఆరోగ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఐసీయూలో చికిత్సపొందుతున్న ఫార్మడి ఫైనలియర్ విద్యార్థిని ఎన్.నాగాంజలి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోంది. ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీపక్ తనను మోసం చేశాడనే మనస్తాపంతో అంజలి ఈ నెల 23న మత్తు ఇంజక్షన్ అత్యధిక మోతాదులో తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆరు రోజులుగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం కూడా ఎటువంటి మార్పు కనిపించలేదని సమాచారం.

ఎండల్లో హాయ్... హాయ్...



చల్లదనాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణం...

- గాలిలో నాణ్యత పెంపునకు మిషన్
- రాజమహేంద్రవరంలోని రద్దీ ప్రాంతాల్లో వినియోగం
- నగర ప్రజలను ఆకర్షిస్తున్న వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ మిషన్



లాలాచెరువు హైవేలో నీటిని స్ప్రే చేస్తున్న మిస్టింగ్ మిషన్



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాలిలో నాణ్యతను పెంపొందించే వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం వీధుల్లో తిప్పుతున్నారు. ఇది వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ఆయా ప్రాంతాలను చల్లబరుస్తుంది. వాహనాలు, పేపరుమిల్లు వాయు కాలుష్యంతో నగర ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చే పరిస్థితి లేదు. దీంతో గాలిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనాన్ని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.47.79 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. దీనిని ఇప్పుడు నగరంలో తిప్పుతున్నారు. ఈ వాహనం వెళ్తున్న క్రమంలో వాటర్ ఆవిరి రూపంలో గాలిలోకి స్ప్రే అవుతుది. దీంతో కాలుష్య నియంత్రణ జరుగుతోంది. అంతేగాక అధిక ఉష్ణోగ్రతలతో వేడెక్కిన ఆ ప్రాంతం ఒక్కసారిగా చల్లబడి ప్రజలు, వాహనచోదకులు సేదదీరుతున్నారు. వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను వాహనాన్ని నగరంలో నిత్యం రద్దీగా వుండే దేవీచౌక్, జైలు రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాలచెరువు, గోకవరం బస్టాండ్, పుష్కరాల రేవు, గెయిల్ ఆఫీస్ రోడ్డు, ఏపీఏ రోడ్డు, దానవాయిపేట, ప్రకాష్‌నగర్, జేఎన్ రోడ్డుల్లో తిప్పుతున్నారు. వాహనం వెళ్లిన 15 నిమిషాల వరకు ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటోంది. మండిపోతున్న ఎండల్లో వాహనచోదకులు, బాటసారులకు కాస్త చల్లదనం పంచుతోంది. ప్రతిరోజు మధ్యాహ్నం పూట ఈ వాహనం నీటిని స్ప్రేయింగ్ చేస్తూ నాణ్యమైన గాలితో పాటు చల్లదనాన్ని అందిస్తోంది.

8వేల లీటర్ల నీటితో గాలిలో స్ప్రేయింగ్

వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడంతో కాలుష్యం తగ్గుతుంది. ఈ వాహనంలో వినియోగించే నీటిలో క్లోరిన్ తక్కువగా వేసి శుద్ధి చేసిన 8వేల లీటర్లను నింపుతారు. రోజుకు రెండున్నర గంటల పాటు 9.5 కిలోమీటర్ల మేర తిరిగి నీటిని గాలిలో స్ప్రే చేస్తుంది. దీంతో గాలిలోని దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయి. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లేందుకు షెడ్యూల్ తయారు చేశారు. ఈ వాహనంలో డ్రైవర్, ఆపరేటర్ ఉంటారు.



దాట్ల దేవదానం రాజుకు కళారత్న పురస్కారం

యానాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కళారత్న(హంస) పురస్కారం అందజేస్తున్నట్టు సాంస్కృతికశాఖ డైరెక్టర్, కన్వీనర్ ఆర్.మల్లికార్జునరావు నుంచి సమాచారం అందిందని యానానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తెలిపారు. ఉగాది సందర్భంగా ఆదివారం జరిగే ప్రత్యేక సభలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా తమ్ములపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. కథకుడిగా, కవిగా, విమర్శకుడిగా, చరిత్రకారునిగా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న రాజు పురస్కారం స్వీకరిస్తున్నందుకు కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ విష్ణువర్ధన్‌కు అదనపు డీఎంఈగా పదోన్నతి



జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అదనపు డీఎంఈగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

నోటిఫికేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరు 30న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహానాయక్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, ఎఫ్ఎన్‌వో, శానిటరీ అటెండర్ కం వాచ్‌మెన్ పోస్టులు ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ రద్దు నేపథ్యంలో దరఖాస్తుదారులకు డీడీలు తిరిగి ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయించినట్టు తెలిపారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో వచ్చే నెల 26వరకు డీడీలు తిరిగి ఇస్తామన్నారు. డీడీల కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ నకళ్లు అందించాలని, అప్లికేషన్ నెంబర్ చెప్పాలని తెలిపారు. పోస్టుల రేషనలైజేషన్‌లో భాగంగా నోటిఫికేషన్ రద్దు చేసినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు.

గిరిజన విద్యార్థినికి గర్భ నిర్ధారణ పరీక్షలు?

అడ్డతీగల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక పాఠశాలలో అభ్యసిస్తున్న గిరిజన బాలిక గర్భం దాల్చినట్లు విశ్వసనీయ సమాచారం. అల్లూరి జిల్లా అడ్డతీగలలో జరిగిన ఈ సంఘటనపై రంపచోడవరం ఉన్నతాధికారి ఒకరికి ఈ సమాచారం అందడంతో నిజానిజాలు నిర్ధారించడానికి గంగవరం మండలానికి చెందిన మండల స్థాయి అధికారిణిని అడ్డతీగల వెళ్లి సదరు గిరిజన బాలికకు వైద్య పరీక్షలు చేయించి తమకు నివేదిక పంపించాలని ఆదేశించినట్లు సమాచారం. ఆ విద్యార్థినికి అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఈ అంశంపై రంపచోడవరం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య ఈ వదంతులను ఖండించారు.

భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- వాడపల్లి వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన
- ఫ్లైఓవర్, లైన్లు ప్రారంభం



ఫ్లైఓవర్, లైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఫ్లైఓవర్, క్యూలైన్లను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారించామన్నారు. కూటమి ప్రభుత్వం మాస్టర్ ప్రణాళికలను రూపొందించిందని అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. అనంతరం లైన్లు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర పనులను పరిశీలించి ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుకు పలు సూచనలు చేశారు. కోనేరు, అన్నదాన భవన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. తొలుతగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆక్రమణలు తొలగించే విషయంలో కొంతమంది వ్యాపారులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి తమ బాధను తెలిపారు. అనంతరం వారందరితో ఆయన చర్చించారు. కార్యక్రమంలో నాయకులు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, యేపుగంటి వెంకటేష్, అల్లు భాస్కరరావు, ఎంవీవీ సత్యనారాయణ, పిండెం వెంకన్న పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చించిన ఆర్డీవో

ప్రతి శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను ఆర్డీవో పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన చర్చించారు. లైన్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఏప్రిల్ 7 నుంచి జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన చర్చించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు ఆర్డీవో సమీక్ష చేశారు. మరో విడత వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. ఆర్డీవో వెంట తహశీల్దారు శ్రీధర్, ఎంపీడీవో రామన్, ఎస్ఐ రాము ఉన్నారు.

నూకాంబిక జాతర ఉత్సవాలు



కాగడాలు వేస్తున్న భక్తులు, నూకాంబికా అమ్మవారు



అలమూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో పేరుగాంచిన అమ్మవారి జాతరలలో ఒకటైన అలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొంటున్నారు. అమ్మవారికి చంటి పిల్లల చేత కాగడాలు వేయించడంతోపాటు తుళ్లబిళ్ల, వారపోయుట, కావిడికోళ్ల మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. జాతరలో రంగురంగుల విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు నిర్వహణ కోసం వివిధ శాఖ అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి ఆయాశాఖల అధికారులు ఉత్సవ ఏర్పాట్లు తహశీల్దార్ ప్రకాష్‌బాబు పర్యవేక్షించారు. పారిశుధ్య ఏర్పాట్లపై ఎంపీడీవో ఎ.రాజు ప్రత్యేక సిబ్బంది నియమించారు. జాతర ఉత్సవాలు సజావుగా జరిగేందుకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ పర్యవేక్షణలో అలమూరు ఎస్ఐ ఎం.అశోక్ దాదాపు మూడు వందల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఉగాది నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సీఆర్సీ అధ్యక్షుడు నాగమోహనరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగమోహన్‌రెడ్డి

రావులపాలెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీలో సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 25వ ఉగాది ఆహ్వాన నాటక పోటీలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి తెలిపారు. రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఆర్సీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 31, ఏప్రిల్ 1న నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా సినిరచయిత, సీఆర్సీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ తనికెళ్ళ భరణి ఆధ్వర్యంలో, డాక్టర్ కోట శంకరరావు, డాక్టర్ గౌతంరాజు, గుండు సుదర్శన్‌తో పాటు పలువురు వ్యవహరిస్తున్నారన్నారు. నాటక కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి నాటిక పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన ముందుగా శ్రీవిశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు, బ్రహ్మశ్రీ పెదసనగంటి సీతారామమూర్తి శర్మఅవధానిచే పంచాంగ శ్రవణం అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెదేవంకు చెందిన శుక్ల యజుర్వేద తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు ఆరాధ్యుల అప్పనసోమయాజికి వేదపండిత సత్కారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మేకప్ ఆర్టిస్ట్ అడివి శంకరరావుకు డాక్టర్ తనికెళ్ళ భరణి కాటన్ కళా పురస్కారాన్ని అందజేస్తారన్నారు.

మన ప్రాజెక్టులకు సీఎం ఓకే

- యాక్షన్ ప్లాన్ ప్రకారం లక్ష్యాలు సాధించాలి
- జిల్లా అధికార్లకు 'తూర్పు' కలెక్టర్ ప్రశాంతి దిశానిర్దేశం

రాజమహేంద్రవరం, మార్చి28(ఆంధ్రజ్యోతి): విజన్-2047 లక్ష్య సాధన కోసం మన జిల్లాలో ప్రతిపాదించిన ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇక మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి మండల స్థాయిలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయడానికి సిద్ధం కావాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాలను కలెక్టర్ వివరించారు. వ్యవసాయ, హార్టీకల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ, అధికారులు జీవీఏ వృద్ధి రేటు పెంచేలా తయారు చేసిన నివేదికలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. దీని కోసం క్షేత్రస్థాయిలో ప్రణాళికలను ఆచరించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు పెంచేదిశలో పంటల మార్పిడి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలసాగు, పొలాల గట్లపై అంతర పంటలు, పశువుల దాణా, గడ్డి సాగువంటివాటిపై దృష్టి పెట్టాలన్నారు. మెరుగైన అధిక దిగుబడులను సాధించేలా పంటకు అవసరమైన వత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో దశల వారీగా పంట మార్పిడి విధానాలు అమలు చేయాలన్నారు. హార్టికల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ రంగంలో కూడా ఆవిష్కరణలు ఎక్కువగా ఉండాలని ఆదేశించారు. 100శాతం సాగుభూమిని వినియోగంలో తేవాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ఏడాది 15శాతం వృద్ధి రేటు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని, వాటిని మండలాల వారీ అమలు చేయాలని ప్రశాంతి చెప్పారు. వ్యవసాయంలో 17.57శాతం, హార్టీకల్చర్‌లో 16.33శాతం, పశుసంవర్ధక శాఖలో 19.76శాతం కలిపి వ్యవసాయ అనుబంధ రంగాల్లో 40.62శాతం వృద్ధిరేటు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇండస్ట్రీ అనుబంధ రంగాల్లో 18.01శాతం, పర్యాటక, సేవ,రియల్ ఎస్టేట్, రవాణా రంగాల్లో 41.37శాతం వృద్ధిరేటు సాధించేలా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం
రూ.1.19 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1.19,10,887 నగదు, 25 గ్రాముల బంగారం, 512 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్‌ఏకు చెందిన 46 డాలర్లు, మలేషియా 15, ఆస్ట్రేలియా 20, యుఏఈ 105 దిరహమ్స్ లభించాయి. 25 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు రూ.4.76 లక్షలు భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించుకున్నారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది,సేవాసంస్థ సభ్యులు లెక్కించారు.

పట్టువస్త్రాలు సమర్పణ


పట్టువస్త్రాలు అందిస్తున్న లక్కీషోరూం అధినేతలు

విశ్వావసు నామ ఉగాది పర్వదినం పురస్కరించుకుని విశాఖపట్నం లక్కీషోరూం ప్రతినిధులు శ్రీనివాసరావు, దత్తయ్యలు శుక్రవారం రత్నగిరిపై స్వామి,అమ్మవార్లకు, ఉపాలయాలలో ఉన్న సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. వాటిని ఆలయ ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నసత్ర సమాజం అధ్యక్షుడు పేరూరి గాంధీ పలువురున్నారు.

సీతారాముల కల్యాణానికి...

అన్నవరం ఆలయ క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలు సందర్భంగా విశాఖపట్నంకు చెందిన మల్లెల వీరరాఘవరావు, దువ్వ గ్రామానికి చెందిన కాశీ పట్టువస్త్రాలను దేవస్థానం అధికారులకు అందించగా దాతలను ఆయన అభినందించారు.

రూ.10 లక్షల విరాళం


రూ.10లక్షల విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి శుక్రవారం ఒక దాత రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా పేరు చెప్పడానికి ఇష్టపడని రాజమండ్రికి చెందిన దాతను ఈవో అభినందించారు.

అమ్మ,నాన్నలు మందలించారని
ఆరుగురు విద్యార్థుల అదృశ్యం


విద్యార్థులు పృథ్వీవర్మ, కరుణ, పండు, సంతోష్, సతీష్, మాధురి

- ఆలమూరులో వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆలమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు సక్రమంగా వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఆరుగురు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన ఆలమూరులో వెలుగులోకి వచ్చింది. డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఖండ్రిగలోని యానాదుల పేటకు చెందిన విద్యార్థులైన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ఈనెల 24న రాత్రి ఏడుగంటల సమయంలో ఇంటి నుంచి పరారయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలమూరు యానాదులపేటలో కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగించే ఐదు కుటుంబాలకు చెందిన కొమరగిరి పృథ్వీవర్మ (12) 6వ తరగతి, కొమరగిరి కరుణ(14) 8వ తరగతి, గంధం సత్యనారాయణ(13) 8వ తరగతి, మరి సంతోష్(14) 7వ తరగతి, కొమరగిరి పండు (12) 6వ తరగతి, రామచంద్రపురానికి చెందిన కొమరగిరి మాధురి(12) 7వ తరగతి చుదువుతున్నారు. కొమరగిరి కరుణ ఆలమూరు బొబ్బా జయశ్రీ గరల్స్ హైస్కూల్‌లో చుదువుతుండగా పృథ్వీవర్మ, సత్యనారాణ, సంతోష్, పండులు కొత్తూరు సెంటర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. మధురి రామచంద్రపురంలో చదువుతుండగా 4రోజుల క్రితం ఆలమూరుకు తన చిన్నమ్మ ఇంటికి వచ్చింది. ఈ ఆరుగురు ఈనెల 24న రాత్రి 7గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి స్థానిక వినాయక గుడి సెంటర్ నుంచి వెళ్లినట్టు పోలీసులు సేకరించిన సమాచారం మేరకు తెలుస్తుంది.

ఒకే కాలనీ వాసులు

అదృశ్యమైనవారంతాఆలమూరులోని యానాదులపేటకు చెందినవారు. ఇక్కడ దాదాపు 50 కుంటుబాలు కూలీపనులు, చేపలవేట తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. పిల్లలను స్కూల్‌కు పంపించి తల్లిదండ్రులు పనులకు వెళ్లడం జరుగుతుంది. అయితే వారిపై సక్రమైన అజమాయిషీ లేకపోవడంతో స్కూల్‌కు వెళ్లడం లేదు. దీంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వారిని మందలించడం జరిగింది. దీంతో అలిగి ఇంటి నుంచి పరారైనట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లిదండ్రులు వివరించారు.

ఆచూకీ కోసం ప్రత్యేక బృందం

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఆలమూరు ఎస్‌ఐ అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో సీసీ పుటేజ్‌లను సేకరించే చర్యలు చేపట్టారు.

కర్రతో కొట్టి.. ఎండలో మోకాలి కుర్చీ వేయించి!

- విద్యార్థినిపై హిందీ టీచరు దాష్టీకం
- సొమ్మసిల్లి ఆసుపత్రిలో చేరిన వైనం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరి

సామర్లకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మహేశ్వరి చేతులపై హిందీ టీచరు భారతిలక్ష్మి తీవ్రంగా కర్రతో కొట్టడమే గాక ఆరుబయట ఎండలో మోకాలి కుర్చీ వేయించడంతో బాలిక సొమ్మసిల్లి పడిపోగా సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం సాయంత్రం చేర్పించారు. పాఠశాల ప్రధానోధ్యాయురాలు పదోతరగతి పరీక్షల పేపర్లు అప్పగించేందుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. తల్లితండ్రులు కౌన్సిలరు సత్యనారాయణ సాయంతో బాలికను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు.

అవినీతి.. 'లక్ష'ణాలు!

మొన్న పిఠాపురం రూరల్ ఎస్ఐ.. నేడు కాకినాడ జిల్లా సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్.. వరుసగా అవినీతి ముసుగు వేసుకున్న లంచావతరాల గుట్టు బయటపడడం కాకినాడ జిల్లాలో సంచలనమైంది.

- కాకినాడలో ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్..
- గ్యాస్ ఏజెన్సీ యజమాని పేరు మార్పునకు రూ.లక్ష డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన ఏజెన్సీ యజమాని
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇటీవల ఏసీబీకి చిక్కిన పిఠాపురం రూరల్ ఎస్ఐ


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నగదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మొన్నటికి మొన్న ఏసీబీ వలకు పోలీసు అవినీతి తిమింగలం చిక్కింది.. తాను ప్రైవేటుగా పెట్టుకున్న డ్రైవర్ ద్వారా రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎల్.గుణశేఖర్ ఈ నెల 24వ తేదీ రాత్రి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకే మరో భారీ అవినీతి తిమింగలం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల వలకు పట్టుబడింది. కాకినాడ జిల్లాలో నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ఈ వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన కొందరు లంచాలు డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు వరుసగా పట్టుబడడం సంచలనమైంది.

భారీ అవినీతి తిమింగలం..

కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ అనగానే ఆదాయం భారీగా ఉంటుంది. జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడికి వివిధ పనుల నిమిత్తం క్రయవిక్రయదారులు అధికంగా వస్తుంటారు. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, సబ్ రిజిస్ట్రార్‌లు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ డాక్యుమెంట్ రైటర్లు కూడా ఎక్కువే. నిత్యం వీరంతా కార్యాలయంలోనే నేరుగా తమ పనులు చక్కబెట్టుకుంటారు. మరోవైపు సిబ్బంది కూడా చాలామంది ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేశారు. అవినీతికి అలవాటు పడ్డారు. రోజువారీ టార్గెట్లు పెట్టుకుని చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఇక జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు విషయాని కొస్తే.. ఈయన సొసైటీ, ఫర్మ్, ఎడిట్ ఇండెక్స్(తప్పుల సవరణ, పోస్టు ఫ్యాక్టో పనులు, పవర్ వాల్యూషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తనిఖీ ఈయన పని.. జిల్లాలోనే ఆయన గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆడిట్ అండ్ మార్కెట్ రిజిస్ట్రార్‌గా రెండేళ్లపాటు కాకినాడలో పనిచేశారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై రాజమండ్రి వెళ్లిపోయారు.. 2024 ఆగస్టులో బదిలీపై తిరిగి కాకినాడ వచ్చారు.

రూ.లక్ష డిమాండ్ చేసిన రిజిస్ట్రార్..

తన భార్య పేరున ఉన్న గ్యాస్ ఏజెన్సీని తన పేరున పార్టనర్ షిప్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వచ్చిన తునికి చెందిన ఆర్.రమేష్‌బాబు నుంచి రూ.లక్ష డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కాడు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు. ఆయనతో పాటు మరో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తునికి చెందిన ఆర్.రమేష్‌బాబు తన భార్య పేరున ఉన్న సమతా గ్యాస్ ఏజెన్సీని కొన్ని కారణాలతో తన పేరున మార్చుకోవాలని, పార్టనర్‌షిప్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకుగాను జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావును ఆశ్రయించాడు. ఆ పని చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని ఆనందరావు డిమాండ్ చేశాడు. 15 రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండగా రమేష్‌బాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన రమేష్‌బాబు లంచం సొమ్మును ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆనందరావు నుంచి రూ.లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25 వేలు, అనధికారికంగా ఉన్న మరో రూ.85వేల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు తెలిపారు.

కారులో నగదు, ఖరీదైన మద్యం సీసాలు, స్వాధీనం

ఏసీబీకి పట్టుబడిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావును ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి విచారించారు. ఆయన కారులో సుమారు రూ.7.80లక్షల నగదు, ఖరీదైన 13 మద్యం సీసాలను గుర్తించారు. వీటిని కాకినాడ ఇంద్రపాలెంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఆనందరావుపై అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనకు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంల్లో భారీ భవంతులు ఉన్నట్టు సమాచారం.

డిప్యూటీ సీఎం ఇలాకాలో...

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మండలం దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ రూరల్ ఎస్ఐ గుణశేఖర్, అతడి పోలీసు వాహనంపై ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ ఏసీబీ అధికారులకు చిక్కారు. 2024 అక్టోబర్ నెలలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో జిల్లాస్థాయి అధికారుల విచారణ అనంతరం పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, గంగరాజులను నిర్దోషులుగా గుర్తించారు. వారి పేర్లను కేసు నుంచి తొలగించేందుకు రూరల్ ఎస్ఐ గుణశేఖర్ లంచడం డిమాండ్ చేసి 20 రోజులుగా తిప్పుతున్నారు. బేరసారాల అనంతరం రూ.20 వేలకు అంగీకారం తెలిపి.. ఆ సొమ్ము తీసుకుంటుండగా గుణశేఖర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో జరిగిన ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. అయితే దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే నేరస్తులతో పాటు వారికి అండగా ఉండే నాయకులు, పోలీసులను ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల అంశంపై అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు పోలీసు స్టేషన్లలో పరిస్థితిపై ఇంటిలిజెన్స్ నివేదిక తీసుకోవాలని ఆదేశించారు.

పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు చేసి నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా శుక్రవారం తెలిపారు. 31వ తేదీన రంజాన్ సెలవు దినం కావడం వల్ల ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ఏప్రిల్ 1వ తేదీకి మార్పు చేసినట్టు తెలిపారు. పరీక్షా తేదీ మార్పును పరీక్షా సిబ్బంది, అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించి విద్యార్థులకు తెలియచేయాల్సిందిగా సూచించారు.

ఆగిన అంతిమయాత్ర!

- బాణసంచా పేల్చడంతో హఠాత్తుగా తేనెటీగల దాడి
- మృతదేహాన్ని వదిలి పరుగులు పెట్టిన కుటుంబ సభ్యులు, బంధువులు
- 26 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
- రహదారిపైనే రెండుగంటల పాటు మృతదేహం


రహదారిపై ఉండి పోయిన వృద్ధురాలి మృతదేహం


గాయపడ్డ వారికి పీహెచ్‌సీలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఎటపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ దహన సంస్కారాలు నిర్వ హించేందుకు అంతిమయాత్రగా వెళ్తున్నారు. అ యితే బాణసంచా కాల్పుల అలికిడికి తేనే తుట్ట కదిలి అంతిమయాత్రలో పాల్గొన్న వారిపై ఒక్క సారిగా దాడిచేశాయి. దీంతో వారు మృతదేహా న్ని అక్కడే వదిలి పెట్టి ప్రాణభయంతో పరుగులు తీశారు. దాంతో అంతిమయాత్ర ఆగిపోయిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడు గ్రామంలో జరి గింది. గన్నేరుకొయ్యపాడు గ్రామానికి చెందిన కొప్పుల పల్లమ్మ (82) గురువారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం అంతిమయాత్ర ని ర్వహించారు. అయితే ఇందులో భాగంగా రెండు సార్లు (దింపుడుకళ్లం) మృతదేహాన్ని కిందకు దించుతారు. గన్నేరుకొయ్యపాడు గ్రామంలో 3 రహదారుల జంక్షన్ వద్ద మృతదేహాన్ని పాడి మీద నుంచి కిందికి దింపి బాణసంచా కాల్చల ంతో చెట్టుపై తేనేపట్టుతో ఉన్న తేనెటీగలు అం తిమయాత్రలో పాల్గొన్నవారిపై దాడి చేశాయి. దాంతో అక్కడ ఉన్న సుమారు 70 మంది తలో దిక్కుకు పరు గులు తీశారు. 100పైగా తేనేటీగ లు మూకుమ్మడిగా దాడి చేశాయి. ముగడ చంద్రశేఖర్ అనే వ్యక్తి స్పృహ కోల్పోయాడు. కొందరు నీటి దమ్ముల్లో దాక్కున్నారు. మరికొందరు ఇళ్లలోకి పరుగులు పెట్టారు. 26 మంది గాయపడ్డారు. వెంటనే సమీపంలోని గౌరిదేవి పేట పీహెచ్‌సీకి వెళ్లడంతో ఇద్దరు వైద్యులు, సిబ్బంది గాయపడ్డ వారి శరీరంపై తేనే టీగల ముళ్లను తొలగిం చారు. దాంతో వారికి ప్రాణా పాయం తప్పింది. ముగడా చంద్రశేఖర్, కొప్పుల వెంకటేశ్వరావు, ముత్యాల నరేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి పాల వడంతో పల్లమ్మ అంతిమయాత్ర ఆగిపోయి మండుటెండలో మృ తదేహం రహదారిపై 2 గంటల పాటు ఉండి పోయింది. తేనెటీగలు ఇంకా చుట్టుముట్టి ఉన్నాయన్న భయంతో మృతదేహం వద్దకు వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. తర్వాత మృతదేహాన్ని ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి


మృతిచెందిన వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతిచెందాడు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురం రామారావుపేటకు చెందిన దోనిపాటి వెంకటేశ్వరరావు(44) అదే గ్రామంలో ఒక రైతు పొలంలో కొబ్బరికాయలు పోగు చేస్తుండగా తాచుపాము కాటు వేసింది. అతడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడికి భార్య కనకలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీబీ స్వామి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

మరోచోట యువతి...


మరణించిన శృతిప్రియ

మామిడికుదురు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన కంచి శృతిప్రియ (24) పాము కాటుకు గురై గురువారం మృతిచెందింది. ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతున్న సమయంలో శృతిప్రియ పాముకాటుకు గురవ్వడంతో ఆమెను కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మరణించింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేశారు.

మోటార్‌సైకిల్ ఢీకొని కల్లుగీత కార్మికుడి మృతి

గొల్లప్రోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గుత్తుర్తి అప్పారావు(65) సైకిల్‌పై ఏపీ మల్లవరం బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొనడంతో అప్పారావుకు తీవ్రగాయాలయ్యాయి. తొలుత పిఠాపురం, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. అప్పారావు కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త దుస్తులు కొన్నా.. కళ్లు తెరమ్మా!

- కాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి
- తట్టుకోలేక విలవిల్లాడిన తల్లి


విలపిస్తున్న అనూషా భార్గవి తల్లి, బంధువులు


భార్గవి (ఫైల్‌ఫొటో)

అనపర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో పుట్టినరోజు జరుపుకోవలసిన చిన్నారిని కాలువ రూపంలో మృత్యువు కబళించింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని నల్లకాలువలో పడి నాలుగేళ్ల చిన్నారి మృతిచెందింది. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన మచ్చ అనూషాభార్గవి (4) అదృశ్యమైంది. తల్లిదండ్రులు దొరబాబు, భవానీ వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సిబ్బంది పాప నివాసం ఉండే సమీపంలోని కాలువ వెంబడి గాలింపు చేపట్టగా సాయంత్రం చింతపల్లి లాకుల వద్ద పాప మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాప ఆడుకుంటూ కాలువలోకి జారి పడి ఉంటుందని భావిస్తున్నట్టు సీఐ తెలిపారు. మే నెల 28న పుట్టినరోజు జరుపుకునేందుకు చిన్నారికి కొత్త దుస్తులు కూడా కొన్నానని, తాను ఇప్పుడు ఎవరికి పుట్టినరోజు ఎవరికి చేయాలంటూ చిన్నారి తల్లి భవాని రోదనలతో ఆ ప్రాంతంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చిన్నారి మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసుకువస్తున్న సీఐ సుమంత్

నేడు తునిలో మెగా జాబ్ మేళా

కాకినాడ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తునిలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వికాస ఆధ్వర్యంలో శనివారం జరిగే మెగా జాబ్ మేళా వివరాలను తెలిపే ప్ల కార్డులను కలెక్టర్ షాన్ మోహన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 ప్రముఖ కంపెనీల్లో 1,235 ఉద్యోగాలకు నిర్వహించే జాబ్ మేళాలో అర్హులందరూ పాల్గొనాలన్నారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా దేవి

తొలిసారిగా ఎస్సీ మహిళకు అవకాశం



పిఠాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి నియమితులయ్యారు. ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న నియోజకవర్గ పదవిని తొలిసారి ఎస్సీ మహిళకు కేటాయించగా దేవికి దక్కింది. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో జన్మించిన ఈమెకు పిఠాపురం మండలం కందరాడకు చెందిన వాకపల్లి సూర్యప్రకాష్‌తో వివాహమైంది. పదవ తరగతి వరకు చదువుకున్నారు. సూర్యప్రకాష్-దేవి దంపతులు తొలుత ప్రజారాజ్యంలో వున్నారు. జనసేన ఆవిర్భావం నుంచీ ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. పవన్‌కల్యాణ్ సీఎం కావాలని సూర్యప్రకాష్ గతంలో పాదయాత్ర నిర్వహించారు. పలువురు జనసేన నాయకులు దేవిని కలిసి అభినందించారు.

కరప ఏఎంసీ చైర్మన్‌గా రమేష్



కరప, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్ నియమితులయ్యారు. మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. జనసేన ఆవిర్భావం నుంచీ రమేష్ క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా కీలక పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే పంతం నానాజీ భావించారు. అయితే మండలం నుంచి పలువురు నాయకులు ఈ పదవి కోసం పోటీపడగా చివరకు లాటరీ తీసి రమేష్ నియామకాన్ని ఖరారు చేశారు. రమేష్‌ను ఎమ్మెల్యే నానాజీ, నాయకులు డాక్టర్ బొండా సూర్యారావు, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, దేవు వెంకన్న, కాకర్ల బుజ్జిబాబు చౌదరి, గ్రామస్తులు అభినందించారు.



రక్తదానం చేస్తున్న జేఎన్టీయూకే మాజీ వీసీ ప్రసాదరాజు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శ్యామ్‌కుమార్

మెగా రక్తదాన శిబిరం

జేఎన్టీయూకే, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్, కాకినాడ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య, విశిష్ట అతిథులుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించగా అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. వర్శిటీ మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, డాక్టర్ శ్యామ్‌కుమార్ రక్తదానం చేశారు. యూసీఈకే, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన ఒప్పంద పత్రాలను వీసీ ప్రసాద్, వైడీ రామారావు సమక్షంలో మార్చుకున్నారు. సుమారు 250 మంది వలంటీర్లు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి కె.శివకుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వైద్య సేవలపై హర్షం

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన 21 ఏళ్ళ శ్రీపాద సూర్యతేజ ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజుల క్రితం అతడు జ్వరం, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సుమారు ఐదు రోజుల పాటు తిండి తినలేకపోయాడు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులైన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, రామకృష్ణ కుమారుడిని పలువురు ప్రైవేటు వైద్యుల వద్దకు తీసుకెళ్లినా తమవల్ల కాదని చేతులెత్తేశారు. మరో మార్గం లేక ఫిబ్రవరి 23న సూర్యతేజను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. పలు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతడు హెపటైటిస్-ఎతో పాటు లెప్టో స్పైరోసిస్ వ్యాధి బారిన పడినట్టు నిర్ధారించి ఎం-1 వార్డులో చేర్చారు. మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ యశోదమ్మ పర్యవేక్షణలో డాక్టర్ సూర్యకాంత్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ కిరణ్ నాలుగు రోజులు అందించిన వైద్య సేవలతో సూర్యతేజ పూర్తిగా కోలుకున్నాడు. దీంతో అతడి తల్లిదండ్రులు శుక్రవారం జీజీహెచ్ వైద్యాధికారులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారి కోరిక మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజకుమారి, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్: కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయనతో పాటు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

'మేథస్సుతో ఉన్నత విజయాలు సాధ్యం'

కొత్తపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు మేథస్సును ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే అంత ఉత్తమ విజయాలు సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ దామెర విజయలక్ష్మి అన్నారు. కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్లు పి.శరత్‌చంద్రారెడ్డి, నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు మూలపేటలోని రెండు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా 100 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. వారికి సర్టిఫికెట్లను విజయలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

'రేషన్‌కార్డు ఈ-కేవైసీ గడువు పెంచాలి'

పెద్దాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు ఈ-కేవైసీ గడువు పెంచాలని సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, కూనిరెడ్డి రవికుమార్ కోరారు. శుక్రవారం వారు నాగమ్మపేట మున్సిపల్ పాఠశాల సమీపంలోని రేషన్ డిపో వద్ద ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలించారు. కార్డుదారులు ఎండలో నిలుచుని అవస్థలు పడుతుండడాన్ని గమనించారు. ఇక్కడ మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సర్వర్ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో ఆలస్యం జరుగుతోందని సిబ్బంది తెలిపారు.



ఈ-కేవైసీ కోసం ఎండలో నిలుచున్న రేషన్‌కార్డుదారులు

పేదలకు బియ్యం, చీరలు పంపిణీ

పిఠాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మొహిద్దీన్ బాద్‌షా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 130 మంది పేదలకు బియ్యం, చీరలను విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా శుక్రవారం అందజేశారు. అహ్మద్ ఆలీషా, కబీర్‌షా, హుస్సేన్‌షా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మృతి

గొల్లప్రోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కల్లు గీత కార్మికుడు మరణించాడు. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గుత్తుర్తి అప్పారావు (65) సైకిల్‌పై ఏపీ మల్లవరం బయలుదేరాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొనడంతో అప్పారావుకు తీవ్రగాయాలయ్యాయి. తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. అప్పారావు కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పారావుకి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కేడర్‌ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి: మంత్రి నారాయణ



మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు నానాజీ, కొండబాబులను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నాయకులు

సర్పవరం జంక్షన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ వలసపాకలలోని జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే వర్మ, కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ), పిఠాపురం జనసేన ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, బీజేపీ నాయకులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంపై అంతర్గత సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాల అములు, నిర్వహణలో కూటమి నాయకులు కేడర్‌ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని మంత్రి సూచించారు. పార్టీపరంగా ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ల లోన్లు, పథకాల అమలుపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే నానాజీ విలేకరులతో మాట్లాడుతూ ఇన్‌చార్జి మంత్రిని వివిధ పనుల కోసం నిధులు అడిగినట్టు చెప్పారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, రంబాల వెంకటేశ్వరరావు, కాళ్ల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ పీఠాన్ని జనసేన కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా కృషి చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ అభినందించారు. శుక్రవారం వలసపాకలలోని జనసేన కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మిని ఎమ్మెల్యే పరిచయం చేశారు. ఎంపీపీని మంత్రి నారాయణతో పాటు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే వర్మ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, జీని శ్రీనివాస్, నందిపాటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

అధికారులు లేని సమావేశాలు ఎందుకు

సభ్యుల ఆగ్రహంతో గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం వాయిదా... తిరిగి సాయంత్రం నిర్వహణ

గొల్లప్రోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉన్నదే ఇన్‌చార్జి అధికారులు, వారు సమావేశాలకు హాజరుకాకుండా ఇక మేము హాజరై ప్రయోజనం ఏమిటి.. ప్రజాసమస్యలపై ఎవరిని అడగాలి అంటూ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనరు, ఏఈ, ఇతర అధికారులు లేకుండా సమావేశం నిర్వహించవద్దని వారు డిమాండ్ చేయడంతో ఉదయం 11గంటలకు ప్రారంభమైన సమావేశాన్ని సాయంత్రం 4 గంటలకు వాయిదా వేశారు. సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు.

గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. ఉదయం ప్రారంభం కాగానే కమిషనరు కనకారావు, ఏఈ ప్రభాకర్ హాజరు కాకపోవడాన్ని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారావు, గంటా అప్పలస్వామి, మొగలి దుర్గానందరావు సహా పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. మునిసిపల్ మంత్రి నారాయణతో సమావేశం ఉండడంతో కమిషనరు వెళ్లారని మేనేజర్ తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి సమావేశం కొనసాగిద్దామని చెప్పగా మిగిలిన సభ్యులు వ్యతిరేకించారు. దీంతో సమావేశాన్ని సాయంత్రం 4గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. సాయంత్రం ప్రారంభమైన తర్వాత అనధికారిక లే-అవుట్ల వివరాలను అసంపూర్తిగా ఇవ్వడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాన్ లే-అవుట్లలో బోర్డులు ఏర్పాటు చేసినట్టు అధికారులు చెప్పారని, ఇప్పుడు అవి ఎక్కడా కనిపించట్లేదన్నారు. ఏప్రిల్ 5 తర్వాత తాను అనధికారిక లే-అవుట్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు కనకారావు హామీ ఇచ్చారు. ఆరవ వార్డులో డీసిల్టింగ్ పనులు అరకొరగానే చేశారని గొల్లపల్లి అచ్యుతాంబ, పనులు తూతూమంత్రంగా నిర్వహించారని టీడీపీ కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు తెలిపారు. 'కాపు నేస్తం' సభ నిర్వహణకు సంబంధించి గతంలో బిల్లులన్నీ చెల్లించారని, మరలా అజెండాకు ఎందుకు తీసుకువచ్చారని కౌన్సిలర్లు ప్రశ్నించారు. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, టీపీవో నీలిమాదీప్తి పాల్గొన్నారు.

పదో తరగతి జీవశాస్త్రం పరీక్షకు 28,280 మంది హాజరు

కాకినాడ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 142 కేంద్రాల్లో శుక్రవారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు మొత్తం 28,618 మంది విద్యార్థులకు 28,280 మంది హాజరుకాగా 338 మంది గైర్హాజరైనట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. అసిస్టెంట్ కమిషనరు 3, తనిఖీ అధికారులు 31 కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. ఓపెన్ స్కూల్ సోషల్, ఎకనామిక్స్ పరీక్షలకు 2,216 మంది విద్యార్థులకు 2,024 మంది హాజరు కాగా 192 మంది పరీక్ష రాయలేదన్నారు. తనిఖీ అధికారులు 18 కేంద్రాలను తనిఖీ చేశారు.

రంజాన్ పండుగ సందర్భంగా ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్టు డీఈవో రమేష్ తెలిపారు. ఈ సమాచారాన్ని జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ట్రస్టు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

జీజీహెచ్ అభివృద్ధికి రూ.6 లక్షల విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా ట్రస్ట్ ఆసుపత్రి తరపున రూ.6 లక్షల విరాళాన్ని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. ఈ మొత్తంతో జీజీహెచ్‌లోని పల్మనరీ మెడిసిన్ విభాగానికి బ్రాంకో స్కోప్ వంటి ఆధునిక పరికరాలు కొనుగోలు చేయాలని కోరారు.



ఎస్పీకి ఎన్జీవో సంఘం కృతజ్ఞతలు

కాకినాడ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సహాయ సహకారాలు అందించిన ఎస్పీ జి.బిందుమాధవ్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘం ప్రతినిధులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్, కార్యదర్శి పేపకాయల వెంకటరమణ, సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, బి.సుజాత, విజయలక్ష్మి, భారతి, అరదాడి సత్తిరాజు, బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



అధికారులను భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని సర్వే నెం.1లో ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శుక్రవారం పరిశీలించారు. ఈ భూములు చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందా లేదా అని పరిశీలన జరిపారు. కొడవలి రాజు చెరువు వద్ద భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం, రైతుల మధ్య ఉన్న వివాదంపై విచారణ జరిపారు. ఇప్పటికే 15మంది రైతులకు సంబంధించి 10 ఎకరాల భూసేకరణకు రూ.92లక్షలను ప్రభుత్వం వద్ద జమ చేశారు. తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. జేసీ వెంట ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ, సర్వేయర్ కేదారేశ్వరరావు ఉన్నారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలి'

కాకినాడ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కాకినాడలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాలు, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ సెంటర్, గాంధీనగర్, జేఎన్టీయూ ప్రాంతాల్లో ర్యాలీ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఆయన కుటుంబీకులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, క్రైస్తవ బోధకులు పాస్టర్ కేడీపీ ప్రసాద్, ప్రేమ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, మహిళా సమాఖ్య కాకినాడ జిల్లా కన్వీనర్ ఎ.భవాని, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.ప్రేమ్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, బచ్చల చంద్రశేఖర్, టి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐడియల్ కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం

కాకినాడ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఐడియల్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. రసాయన, భౌతిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'కన్వర్జెన్స్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ నానో మెటీరియల్స్ అండ్ నానో టెక్నాలజీ' అంశంపై సదస్సు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వివిధ విశ్వవిద్యాలయాల సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. ముఖ్య అతిథులు ప్రొసీడింగ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఐడియల్ డిగ్రీ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్, సదస్సు చీఫ్ ప్యాట్రన్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ నానోస్కేల్ పరిమాణాలతో కొత్త పదార్థాలను తయారు చేస్తున్నారన్నారు. సీనియర్ శాస్త్రవేత్త ముదిత్ దీక్షిత్, ఓఎన్జీసీ ఈడీ, ఎసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్, అక్కు ప్రొఫెసర్ జగన్మోహన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

'విలీన గ్రామాలతో కలిపి కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విలీన గ్రామాలతో కలిపి కాకినాడ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణకు వినతిపత్రం అందించి తక్షణం ప్రకటన చేయాలన్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడంతో గత మూడేళ్లుగా కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు విడుదల కావట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా విలీన గ్రామాలైన తూరంగి, ఇంద్రపాలెం, వలసపాకల, వాకలపూడి, చీడిగ, రమణయ్యపేట 14ఏళ్లుగా అభివృద్ధికి దూరమైపోయాయన్నారు.

వివాదాల జోలికి వెళ్లవద్దు

పాడా పీడీ చైత్రవర్షిణి

గొల్లప్రోలు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టుకునే విషయంలో వివాదాల జోలికి వెళ్లి శాంతిభద్రతల సమస్య సృష్టించవద్దని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి పెద్ద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో మత్స్యకార సంఘాల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పీడీ పెద్ద చెరువును పరిశీలించి సంఘాల నాయకులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ, మత్స్య శాఖాధికారి రామకృష్ణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రికి ఘన స్వాగతం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ శుక్రవారం విచ్చేశారు. ఆయనకు కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.



మంత్రి నారాయణను సత్కరిస్తున్న వర్మ

ఏలేరు ఆధునికీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలి

కాకినాడ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆధునికీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని మంత్రి నారాయణను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రికి శుక్రవారం మధ్యాహ్నం వర్మ తన నివాసంలో విందు ఏర్పాటుచేసి శాలువాతో సత్కరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీసత్యనారాయణమూర్తి, నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.



నారాయణతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

మర్యాదపూర్వక భేటీ

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ విచ్చేసిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవాలయాలు, మార్కెట్ కమిటీలు, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, ఇతర పదవుల్లో తమ పార్టీ నేతలు, కార్యకర్తలకు అవకాశం కల్పించాలని కోరారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

కరప, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరప శివారు రామకంచిరాజు నగర్ కాలనీ వద్ద చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో జనసేన సీనియర్ నేత బోగిరెడ్డి కొండలరావు (కొండబాబు) శుక్రవారం ప్రారంభించారు. పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామ దేవత నూకాలమ్మ తల్లి దర్శనానికి వెళ్తున్న భక్తులకు మజ్జిగ అందజేసి ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధరరావు, నాయకులు యాళ్ల పండు, పేపకాయల గంగారావు, పవన్‌కుమార్, చిన్నారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

శంఖవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి, మండపం, శంఖవరం గ్రామాల్లో నూకాలమ్మ జాతర వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణాలను ఆకర్షించే దీపాలతో దేవీ, దేవతల విగ్రహ రూపాలను తీర్చిదిద్దారు. అమ్మవారిని సుందరంగా పూలతో అలంకరించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ



గొడుగులు, చెప్పులు పంపిణీ చేస్తున్న అన్నపూర్ణ ట్రస్ట్ నిర్వాహకులు

మోతుగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న గూడూరు గ్రామ పంచాయతీ గిరిజన గ్రామాలకు అన్నపూర్ణ ట్రస్ట్ మోతుగూడెం వారి ఆధ్వర్యంలో గిరిజనులకు 150 గొడుగులు, 150 చెప్పుల జతలు, భోజనం ప్యాకెట్లు 200 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పి.శివప్రాణ హాజరయ్యారు. మలేషియా నుంచి తన బృందం గిరిజన గ్రామాలకు వచ్చి ఇవన్నీ పంపిణీ చేసిందన్నారు. అనంతరం డాక్టర్ పి.శివప్రాణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా సిబ్బంది వచ్చి గిరిజన గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణ ట్రస్ట్ సభ్యులు, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, విజయవాడ నుంచి వచ్చిన ఏపీ జెన్‌కో ఏడీ మహేష్,వేగి శ్రీనివాస్, కొట్టు శ్రీనివాసరావు, శివానందం, కార్తీక్ రత్నాకర్, చంద్రశేఖర్, వేగి రాజా, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



బాల్య చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దేవీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్ తెల్లం శేఖర్ పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, బాలకార్మిక నిర్మూలన గురించి వివరించారు. పారా వలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, అరగంటి వీరభద్రారెడ్డి, తాలూరి రామిరెడ్డి, ఉపాధ్యాయులు వై.నాగేశ్వరరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్న విఘ్నేశ్వరస్వామి వార్షికోత్సవం



అడ్డతీగలలో వేంచేసిన ప్రసన్న విఘ్నేశ్వర స్వామి

అడ్డతీగల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల ప్రసన్న విఘ్నేశ్వరస్వామి వారి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ ధర్మకర్త వంకా రాము బ్రదర్స్ తెలిపారు. అనంతరం గ్రామస్థుల ఆర్థిక సహాయంతో మహాన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా లోత లక్ష్మణరావు



లోత లక్ష్మణరావు

రాజవొమ్మంగి, మార్చి 28: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శరభవరం పంచాయతీకి చెందిన లోతా లక్ష్మణరావును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడుసార్లు శరభవరం పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఈయన కుమార్తె రాజ్యలక్ష్మి శరభవరం సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. దీనిపై టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ పదవి ఇచ్చేలా కృషి చేసినందుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో నూరుశాతం అడ్మిషన్లు కల్పించాలి

● ఐటీడీఏ పీవో సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 2026- 27 విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నూరుశాతం అడ్మిషన్లు కల్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఐసీడీఎస్ సీడీపీవోల తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణమోహన్, మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, రామకృష్ణ, బాపన్నదొర, సూరారెడ్డి, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, సీడీపీవోలు సంధ్యారాణి, ప్రసన్న, దేవమణి, ప్రిన్సిపాల్ వసుధ తదితరులు పాల్గొన్నారు.

● వందన్ వికాస కేంద్రాల ద్వారా జీడీ పిక్కల కొనుగోలు

ఏజెన్సీలో రైతులు సేకరించిన జీడిమామిడి పిక్కలు వందన్ వికాస కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఏడు మండలాల వెలుగు అధికారులు, వందన్ వికాస కేంద్రాల ప్రెసిడెంట్లు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కార్యక్రమంలో ఏపీడీ ఎస్.డేగలయ్య, పీహెచ్‌వో చిట్టిబాబు, డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, యాంకర్ పర్సన్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ స్నేహభావంతో మెలగాలి : ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దంపతులు

రంపచోడవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు స్నేహ భావంతో అన్నదమ్ములవలే కలిసి ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శుక్రవారం రంజాన్ మాసం ఉపవాస దీక్షలను పురస్కరించుకొని స్థానిక మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, భర్త మఠం విజయభాస్కర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరి ప్రార్థనలు సఫలం కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గౌస్, ఎస్‌కే ఖాదర్‌వల్లీ, భషీర్, షేక్ సుభాని, ఎస్‌కే చోటు, తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ వ్యవసాయంతో అధిక లాభాలు

మారేడుమిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులతో అధిక లాభాలు పొందవచ్చని పలువురు శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. శుక్రవారం సున్నంపాడు రైతు సేవా కేంద్రం వద్ద రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వెలుగూరి లచ్చిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాల్దేరు వరిపరిశోధనా కేంద్రం నుంచి పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. అనంతరం గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద రైతులకు టార్పాలిన్‌లు, గడ్డపారలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు నామాల శ్రీనివాసరావు, సీహెచ్ అప్పారావు, ఎంపీటీసీ మడకం అనీల్‌ప్రసాద్, వ్యవసాయశాఖ సహాయకులు గొర్లె కనేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని అర్జీ

రాజవొమ్మంగి, మార్చి 28: రాజవొమ్మంగి గ్రామ శివారులో వట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువపై బ్రిడ్జి నిర్మించాలంటూ వైసీపీ నాయకుడు కనిగిరి దుర్గాప్రసాద్ శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి ఎత్తుగా లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించడం వల్ల శాంతినగర్, శ్రీరామ్‌నగర్, వయ్యాడ, బొరుగుపల్లి, ముర్లవానిపాలెం గ్రామాల ప్రజలు విద్య, వైద్యానికి మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. బ్రిడ్జి నిర్మించడం ద్వారా ఏడు గ్రామాలలో ఉన్న సుమారు 3000 మందికి ఉపయోగకరంగా ఉంటుందని అర్జీలో పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నాణ్యతతో ఉపాధి హామీ పనులు: పీడీ



గ్రామాల వారీగా రికార్డులు పరిశీలిస్తున్న పీడీ అడపా వెంకటలక్ష్మి

గండేపల్లి, మార్చి28(ఆంధ్రజ్యోతి): సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉపాధి హామీ పనులు నాణ్యతతో పారదర్శకంగా చేపడుతున్నామని ఉపాధి హామీ పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికకు పీడీ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. 15రోజులు డీఆర్పీలు సిబ్బందితో కలిసి 2023-24ఏడాదికి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగాయా లేదా, నిధులు సరిగా వినియోగించారా లేదా అనే దానిపై సర్వేలు నిర్వహించి, గ్రామాల్లో ప్రజల సమక్షంలో సభలు నిర్వహించి చివరి రోజు ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ముందుగా పీడీ వెంకటలక్ష్మి గ్రామాల్లో నిర్వహించిన సర్వే వివరాలను ఒక్కొక్కటిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో గడిచిన 2023-24లో 74లక్షలు పనిదినాలు కల్పించడంతో పాటు గ్రామస్థులు, రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీలో సీసీ రోడ్లు, గోకులం షెడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే వేసవిని దృష్టిలో పెట్టుకుని రైతులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తనిఖీలో రూ.42,386 సొమ్ములు రికవరీ పెట్టామని, ఇద్దరికి జరిమానా విధించామన్నారు. రెండు గ్రామా ల్లో సమస్యలు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. కూలీలకు పనిదినాలు కల్పించడంలో మొదటి స్థానంలో ఏలేశ్వరం, రెండో స్థానంలో గండేపల్లి మండలం ఉందన్నారు. మెరుగ్గా పనిచేసిన ఏపీవో గంగాభవానీ, ఈసీ రమేష్‌ను ఆమె అభినందించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏపీడీ భానుప్రకాశ్, ఏవో చంద్రరావు, టీఏలు శ్రీను, మోహన్, శ్రీను, అబ్బులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

గండేపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో రోటరాక్ట్ క్లబ్, అపోలో హెల్త్ సెంటర్ సంయుక్తంగా కంటి వైద్య, గైనకాలజీ ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యస్వరరావు (ఆప్తమాలజీ), డాక్టర్ సంధ్యపితాని (గైనకాలజీ) వైద్య సేవలందించారు. శిబిరంలో అధ్యాపకులకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన, నివారణ చర్యలు, సూచనలు అందించారు. సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ యూత్ రెడ్ క్రాస్ యూనిట్, జీఎస్ఎల్ దంత వైద్యశాల రాజమహేంద్రవరం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

'ఆదిత్య'లో సివిల్ విభాగంలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

గండేపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక రోజు ప్రాజెక్టు ఎక్స్‌పోను నిర్వహించినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. 32 జట్లు పోస్టర్లు, నమూనాల ద్వారా వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎ.నాగసాయి ప్రాజెక్టులను మూల్యాంకనం చేసి మొదటి 3స్థానాలకు ర్యాంక్ ఇచ్చారు.

ఇబ్బందులపై ఖైదీలు ఫిర్యాదు చేయండి

ప్రత్తిపాడు, మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సందర్శించారు. సబ్ జైలులోని అన్ని బ్యారేజ్‌లను పరిశీలించి ఖైదీలకు పెట్టే భోజనం, వసతి పరిశీలించారు. ఖైదీలందరికీ న్యాయవాదులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు ఎటువంటి ఇబ్బందులకు గురైనా ఫిర్యాదు పెట్టులో చీటి రాసి వేయాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్లు ఫిర్యాదుల పెట్టెను తరుచూ పరిశీలించి ఖైదీల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తారని తెలిపారు. జైలు పరిసరాలు, రికార్డులను పరిశీలించారు.

ఒమ్మంగిలో మూడు తాటాకిళ్లు దగ్ధం

రూ.10లక్షల ఆస్తి నష్టం

ప్రత్తిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. రూ.10లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామ శివారున ఉన్న మొగిలి మూలయ్య, పెద సత్తిబాబు, కృష్ణ దావీదులకు చెందిన తాటాకిల్లు కరెంటు షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. ఈప్రమాదంలో గ్యాస్ సిలిండర్‌లు పేలడంతో రెండు ఇల్లు కూడా పూర్తిగా కాలిపోయాయి. గృహంలో దుస్తులు, మొత్తం కాలిపోయి సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. శుక్రవారం ఉదయం నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సంఘటనా స్థలానికి తరలివచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50కిలోల బియ్యం, రూ.5వేలు నగదు బాధితులకు అందజేశారు.

ఎమ్మెల్యే దివ్య ఇఫ్తార్ విందు

తునిరూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): తుని రెడ్ కాన్వెంట్ వీధి ఓ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే యనమల దివ్య ఇఫ్తార్ విందు ఇచ్చారు. దీనిలో ముస్లిం పెద్దలు హాజరయ్యారు. ముస్లిం పెద్దలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. ముస్లిం మతపెద్దలు, కూటమి నాయకులు ఉన్నారు.

పెద్దిపాలెంలో నూకాలమ్మ జాతర మహోత్సవాలు



భారీ ఎత్తున బోనాలతో వస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం పెద్దిపాలెంలో భారీ ఎత్తున మహిళలు బోనాల ప్రదర్శన నిర్వహించి నూకాలమ్మకు సమర్పించారు. తీన్మార్ డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. ఒమ్మంగిలోని నూకాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 4రోజులు ఉత్సవాలు ప్రారంభించి గరగల సంబరాలు నిర్వహించారు. విశాఖపట్నం రాయల్ ఈవెంట్స్ డీజే ప్రోగ్రాం ఆకట్టుకుంది. సర్పవరం ఫైర్ వర్క్ కంపెనీ ఆధ్వర్యంలో మిరుమిట్లు గొలిపే నాగసర్పం, ఈత చెట్టు, మల్లెపందిరి, ఆకాశ దీపాలు తదితర బాణసంచా దృశ్యాలు అలరించాయి. ధర్మవరం నూకాలమ్మ ఆలయం వద్ద గరగల సంబరాలు, పూలగరగల సంబరాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే నెహ్రూకు సత్కారం



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మండలంలోని ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను దళిత నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ధారా ఏసురత్నం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాదిగ కాకాడ నూకరాజు మాదిగ, దూలపల్లి వెంకటరమణ మాదిగ, చీకట్ల నాగరాజు మాదిగ, ఆరుగొల్లు పండు మాదిగ, ధారా సుందరావు మాదిగ, మిట్టపల్లి సుధీర్ మాదిగ, ఆకుమర్తి సాల్మన్ రాజ్ మాదిగ, ప్రసాద్ మాదిగ, యర్రంపాలెం సర్పంచ్ బాదంపూడి ప్రకాష్ మాదిగ, గోకవరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోర్త చిట్టిబాబు, వెదురుపాక మాజీ సర్పంచ్ బొట్ట రామకృష్ణ చీకట్ల రాజు పాల్గొన్నారు.

జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సత్కారం



భరత్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన అడపా భరత్ బాబును రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై భరత్‌బాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భరత్‌బాబు మాట్లాడుతూ నాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాయని, ఆయన సూచనలు సలహాలతో ఆయన ఆశీస్సులతో జగ్గంపేట మార్కెట్‌కమిటీ మరింత అభివృద్ధి పథంలో నడిపించి రైతులకు అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, కన్నబాబు, మారిశెట్టి రాధా, రామకుర్తి నరసింహ, రాయి సాయి, మండపాక అన్నన్నదొర, కొండ్రోతు శ్రీను పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భరత్



జగ్గంపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు అడపా భరత్‌బాబును ప్రభుత్వం నియమించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు భరత్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ, కాపు రుణాలకు ఇంటర్వ్యూలు

కోటనందూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, కాపు రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించామనిఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. బీసీలు 200మంది, కాపులు 40మంది పాల్గొన్నారు. మండలంలోని 17పంచాయతీల్లో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ఇండియా పాతకొట్టాం, కెనరాబ్యాంక్ బీమవరపుకోట, స్టేట్‌బ్యాంక్ కోటనందూరు మేనేజర్లుఇంటర్వ్యూలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తుని రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఎం నాయకులు కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. తేటగుంట గవరపేట తిమ్మాపురం తదితర గ్రామాల్లో గత ప్రభుత్వం లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించేసిందని, మట్టి దొంగలను పట్టుకోవలసిన కూటమి పార్టీల నాయకులు అదే ధోరణిలో ముందుకెళుతున్నారని ఆరోపించారు. దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములు పెత్తందారుల చేతిలోకి వెళ్లాయని, ఆ భూములను మళ్లి దళితులకు ఇచ్చే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

క్వారీ కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్వారీ క్రషర్ల యాజమాన్య తీరుపై క్వారీ యూనియన్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. శుక్రవారం క్వారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కుప్పల నాగభూషణం నేతృత్వంలో కార్మికులకు వేతనాలు పెంచాలంటూ క్వారీపేట నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బాలాజీ చౌక్ సెంటర్‌కు ర్యాలీ చేపట్టారు. కార్మికుల జీతాలపై సరైన నిర్ణయం తీసుకుని అగ్రి మెంటు చేయాలనిలేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. దేవంగుల రాజు, బత్తిన రాజు, రాయుడు చిన్న పాల్గొన్నారు.

కాలువలు పరిశీలించిన జేసీ

తునిరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ పరిధిలో ఆక్రమణలకు గురైన సాగునీటి కాలవలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఎస్.అన్నవరం పరిధిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి సాగునీటి కాలువలను పరిశీలించారు. పోలవరం కాలువలో నిల్వఉన్న నీటిని బయటకు పంపించే ప్రణాళికలు సంబంధిత అధికారులకు వివరించారు.

నేడు తొండంగిలో ఎమ్మెల్యే ప్రజాదర్బారు

తొండంగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే యనమల దివ్య శనివారం ప్రజాదర్బారునిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

ఊపిరి పీల్చుకున్నారు..

● ముఖ్యమంత్రి ప్రకటనతో పోలవరం నిర్వాసితుల్లో ఉత్సాహం



నిర్వాసితుల దరఖాస్తులను శ్రద్ధగా పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

కూనవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అన్ని అర్హతలు ఉండి ఉపాధి కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన వారిని పోలవరం నిర్వాసితుల జాబితా నుంచి తొలగించడంతో కొంతమంది బాధితులు తీవ్ర ఆవేదన చెందారు. ఇల్లు, భూమి ఇక్కడే ఉన్నప్పటికీ మమ్మల్ని గత జగన్ ప్రభుత్వం నిండా ముంచిందని నిర్వాసితులు అప్పట్లో మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సంగతి తెలిసిందే. పై విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, బయట ఉపాధి కోసం వెళ్లిన వారిని పరిహార జాబితాలో చేర్చాలని అధికారులను ఆదేశించడంతో పోలవరం నిర్వాసితులు ఊపిరిపీల్చుకున్నారు. గత ప్రభుత్వం జాబితాలో నుంచి తొలగించిన వారిలో ఎక్కువగా యువతే ఉన్నారు. ఒక్క మేజర్ పంచాయతీ అయిన కూనవరంలో 350 మందికి పైగా పేర్లు తొలగించారు. మరోవైపు నిర్వాసితులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న గ్రామసభలు సైతం ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం తొమ్మిది మొదటి ప్రాధాన్యత గ్రామాలను తీసుకోగా వీటిలో కోండ్రాజుపేట, వాల్ఫర్‌పేట, కూళ్లపాడు, పంద్రాజుపల్లి, కూనవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో నిర్వాసితుల సర్వే పేర్లు పోగొట్టడంతో టేకులబోరు గ్రామానికి గ్రామ సభ ఆలస్యమైంది. నూతన ప్రభుత్వం రాగానే ఆ గ్రామానికి మళ్లీ సర్వే నిర్వహించారు. మరో వారంరోజుల్లో ఈ గ్రామానికి కూడా గ్రామ సభ నిర్వహిస్తారు. గ్రామసభలను ఐటీడీఏ పీవో దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు. ఆయన సైతం అర్హులైన వారికి అన్యాయం చేయవద్దంటూ అధికారులకు చెబుతున్నారు. కొంత వివాదంగా జరుగుతుందనుకున్న కూనవరం గ్రామసభ సైతం ప్రశాంతంగా జరిగింది. కొత్త ఇంటి పన్నుల కోసం కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ నిర్వాసితులకు ప్రత్యేక కౌం టర్లు ఏర్పాటుచేసి అప్పటికప్పుడు ఇంటి పన్నులను నిర్వాసితులకు అందజేశారు. ఇప్ప టికే రాష్ట్ర ప్రభుత్వం 6,270 కోట్లు నిర్వాసితుల కోసం విడుదల చేసిందని తెలియడంతో రాబోయే రోజుల్లో నిర్వాసితులకు నేరుగా తన అకౌంట్లలో పరిహారం రానుందని నిర్వాసితులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం నిర్వాసితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవ డంతో నిర్వాసితులు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అదృశ్యమైన మహిళను బంధువులకు అప్పగింత

కిర్లంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తామరాడ గ్రామానికి చెందిన ఒక మహిళకు ఇష్టంలేని పెళ్లి చేయడంతో 2022 మార్చి 21న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై అప్పట్లో కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు అదృశ్యమైన మహిళల కేసులపై ప్రత్యేక టీమ్స్‌తో దర్యాప్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా అప్పుడు అదృశ్యమైన మహిళను వివిధ గ్రామాల్లో తిరిగి విచారణ చేసి శుక్రవారం ఆమెను వారి బంధువులకు అప్పగించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఈ దర్యాప్తులో విశేష కృషిచేసిన హెడ్‌కానిస్టేబుల్ చక్రవేణిని ఉన్నతాధికారులు అభినందించారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరించండి

ప్రత్తిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల ప్రతినిధులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పి.నారాయణను కోరారు. శుక్రవారం కాకినాడ విచ్చేసిన మంత్రికి ప్రత్తిపాడుకు చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం, ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మంత్రి స్పందిస్తూ సమస్యను సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, జి.విజయ్‌కుమార్, మూర్తి, సతీష్, రామ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపాలు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలు అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నూకాంబిక జాతర

కిర్లంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో నూకాలమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయ కమిటీ ధర్మకర్తలు ముద్రగడ రాజా, నాయుడు, చినబాబు బ్రదర్స్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

విజయేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే

తొండంగి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తుని ఎమ్మెల్యే యనమల దివ్య తన తల్లి విజయలక్ష్మితో కలిసి ఏ.కొత్తపల్లి విజయేశ్వరుని దర్శించుకున్నారు. శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా కదంబ క్షేత్రాన్ని దర్శించి భువనేశ్వరీ సహిత విజయేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు భూమానంద భారతి క్షేత్ర విశిష్టతను వారికి వివరించారు.